# వింతగొడ్రాలు

పొన్నాడ సత్యప్రకాష్



క్రైన్ కథల పోటీలో
ప్రత్యేక సంచిక కోసం
ఎంపిక చేయబడిన కథ

"ఒకటి... డబ్బు"

"రెండు .... డబ్బు"

"మూడు... డబ్బు"

మనిషికి కావలసిన మూడు ప్రధాన వస్తువులేమిటని ఎవరో బెర్నాడ్‌షాని అడిగితే ఆయన చెప్పిన సమాధానం ఇది.

☆ ☆ ☆

అది ప్రభుత్వ ఆసుపత్రి...

లేబర్ వార్డ్. అందులో ఎక్కువగా వున్నది కూడా లేబరే. బెడ్‌లు ఎక్కడా ఖాళీలేవు. కారిడార్లో కూడా పడకల్లాంటివి ఏర్పాటు చేసారు. పసికందుల ఏడుపులతో పచ్చి బాలింతల మూలుగులతో నర్సుల విసుగులతో అటెండర్ల జులుంతో అంతా గందర గోళంగా వుంది.

కారిడార్లో ఏర్పాటు చేసిన మంచంపై పడుకొన్న లక్ష్మి కళ్ళు తెరిచింది. ఆమె రెండురోజుల క్రితమే ఓ చక్కని ఆడశిశువుకు జన్మనిచ్చింది. పూర్తిగా ఇంకా లేవకుండానే బిడ్డకోసం పక్కన చేయి వేసింది. చేతికి బిడ్డ తగలకపోవడంతో చటుక్కున మెలకువ వచ్చేసింది పూర్తిగా. పక్కలో బిడ్డలేదు. పసికూన ఎక్కడికి పోతుంది? లేచి కూర్చుని చూసింది. మంచం కిందకు అటు ఇటు.

ఎవరిని అడుగుదామన్నా ఎవరి గొడవలో వారున్నారు. లక్ష్మి మనసు కీడు శంకిస్తుంది. ఈ మధ్య ప్రభుత్వ ఆసుపత్రులలో పసికందుల దొంగతనాలు ఎక్కువైతున్నాయి. ఆ విషయం గుర్తు రాగానే మరింత వణికిపోయింది. తోటి బాలింత నడిగి చూసింది. చూడలేదన్నారు. ఆమెకు ఏడుపొక్కటే తక్కువ. ఇంతలో దూరంగా వస్తున్న వార్డు నర్సు సావిత్రి కనిపించింది. ఒక్క ఉదుటున ఆమె దగ్గరకి పరిగెట్టింది.

'ఏయ్.... లక్ష్మీ.... నువ్విలా పరుగెట్టకూడదు'

'ఏం చేయమంటావ్? నా బిడ్డ కనిపించటంలేదు'

'నీ బిడ్డ... నీ బిడ్డ... ఇక్కడ ఎందుకుంటుంది?'

'అదేమిటి? నా బిడ్డ ఇంకెక్కడుంటుంది?'

'అంటే ... నీకు నిజంగా తెలియదా? మీ ఆయన చెప్పలేదా?'

'ఆయన చెప్పడమేమిటి?.... నాకేం చెప్పలేదు'.

'మీ ఆయన్నే అడుగు.... నాకు పనుంది. పోనీ' అని పోబోతున్న నర్సుని పోనివ్వలేదు లక్ష్మి. బిడ్డ విషయమై గుచ్చి గుచ్చి అడిగేసరికి చెప్పక తప్పలేదు నర్సుకి.

'మీ బిడ్డని ఎవరికైనా ఇచ్చేయాలనుకున్నారట కదా..... మీ ఆయన ఇచ్చేయమన్నాడు. నేనిచ్చేసాను'.

స్థాణువైంది లక్ష్మి... 'బిడ్డని ఇచ్చేయడమేంటి? ఎవరనుకున్నారు.... అసలు నన్నడగకుండా నా బిడ్డని నువ్వెందుకు ముట్టుకున్నావు' నర్సు పీక పట్టుకోవడం ఒకటే తక్కువ.

ఆ గొడవకి కొందరు వారివైపు చూడసాగారు. అది గమనించిన నర్సు మిగతావాళ్ళు కలుగజేసుకుంటే పరిస్థితి విషమిస్తుందని గ్రహించి 'బాగుందమ్మా! మా ఆవిడ కూడా ఒప్పుకుంది.... కాని నిద్ర లేచేక బిడ్డను తీసుకోవాలంటే కొంచెం బాధపడొచ్చు... అందుకని ఆవిడ నిద్ర లేవకుండానే తీసుకు వెళ్ళు.... ఇదిగో అని మీ ఆయనే నీ బిడ్డను నాకిచ్చాడు.... నన్నంటే మర్యాద దక్కదు.... వెళ్ళి మీ ఆయన్ని అడుగు' అని లక్ష్మి చేతులు విదిలించుకుని వెళ్ళిపోయింది నర్సు.

లక్ష్మికి ఏం జరిగిందో, ఏం జరగబోతోందో అర్థంకావటం లేదు.

"ఈ చాలీ చాలని జీతాలతో ఈ ఆడబిడ్డని ఎలా పెంచుతామో' అని భర్త వాపోవటం తెలుసు... కాని అలా అని బిడ్డని వదులుకుంటామా? మొదటిబిడ్డనీ వదులుకొని... రెండో బిడ్డని కూడా వదులుకోవాలా? రానీ చెబుతాను అనుకొని భర్త కోసం ఎదురు చూడటం మొదలుపెట్టింది. మరో పావుగంటకి దూరంగా వస్తూ కనపడ్డాడు భర్త గోవిందు. చేతిలో బుట్టలో ఫ్లాస్క్, హార్లిక్స్ సీసా, టిఫిన్ ప్యాకెట్,ఏవో మందు బిళ్ళలు కనపడుతున్నాయి. ఆ బుట్ట తనది కాదు. ఫ్లాస్క్ కూడా కొత్తదిగా వుంది.... అనుమానం బలపడుతుండగా భర్తకు ఎదురెళ్ళి "ఏమండీ... మన పాప కనపడటం లేదండీ" అని అడిగింది.

"ష్....నే చెబుతాను ఇలారా.... నువ్విలా తిరగకూడదు. ఇదిగో హార్లిక్స్ తెచ్చాను... ఈ టిఫిన్ తిని హార్లిక్స్ తాగు... చూడు ఎంత నీరసంగా వున్నావో" అంటూ ఆమె జబ్బ పట్టుకుని బెడ్ వరకు తీసుకెళ్ళబోయాడు. బిడ్డ కనపడలేదని చెప్పినా మామూలుగానే వుండే సరికి నర్సు చెప్పినది నిజమేనేమోననిపించింది లక్ష్మికి. ఒక్కసారిగా బాధ, కోపం, జుగుప్సా చుట్టుముట్టాయి ఆమెని... అరవడానికి, ఏడవడానికి కూడా ఓపిక లేకుండా చేశాయి. బెడ్ మీద కూర్చోబెట్టి యిడ్లీ ప్యాకెట్ ముందు పెట్టి సరికొత్త ఫ్లాస్క్‌లోంచి గ్లాసులోకి హార్లిక్స్‌ను పోయసాగాడు. అవన్నీ అప్పుడే కొన్న వస్తువు లని తెలుస్తూనే వున్నాయి. నిన్నరాత్రి భర్త దగ్గర పైసా లేదు... తెల్లవారే సరికి యివన్నీ ఎలా వచ్చాయి? పైగా అతను మాట్లాడుతున్నాడు కాని మొహం లోకి చూసి మాట్లాడటంలేదు....

'బిడ్డను ఎంతకమ్మారండి' అని అడిగింది.

'ఉలిక్కిపడి ఆమెకేసి చూసాడు కంగారుగా గోవిందు... ఆ ...అమ్మడమేమిటి.... ఎవరు చెప్పారు?' అన్నాడు.

'ఎవరు చెప్పారంటున్నారంటే నిజమే నన్నమాట. అయ్యో... ఎంత పని చేసారండీ' అని భోరుమంది లక్ష్మి.

చుట్టుపక్కల వాళ్ళు తమకేసే చూడడం భరించలేక ... "లక్ష్మి... ఊరుకో... నా మాట విను.... బిడ్డను అమ్ముకొనేటంత దుర్మార్గుడినా నేను. నువ్వు తప్పుగా విన్నావు" అన్నాడు.

"అయితే...ఏదీ నాబిడ్డ? నాకు చూపిస్తేనే నమ్ముతాను".

"చూపించలేను... లక్ష్మీ.... అయితే అమ్ముకోలేదు"

"మరి ఏం చేశారు? చంపేశారా?"

"లక్ష్మి.... ! !"

ఇంక ఏం చెప్పలేక పోయాడు గోవిందు అలా అరిచి ఊరుకుండిపోయాడు. అతడికి మాట పెగలడంలేదు. కాస్త తేరుకుని

'మనబిడ్డక్షేమంగా వుంది. యువరాణిలా పెరుగుతుంది లక్ష్మి' అన్నాడు. ఒక నవ్వు నవ్వింది అంత ఏడుపులోను.

'మూడేళ్ళ క్రితం పుట్టిన బిడ్డను యువరాజులా పెరగాలని ఒకరికిచ్చారు. ఇప్పుడీ బిడ్డను యువరాణిలా పెంచుతారని ఇంకొకరికిచ్చారు. ఒక్క బిడ్డను కూడా పోషించలేరా.... ఏం మగాడండీ మీరు...' భర్త అని కూడా చూడకుండా దులిపేస్తుంది లక్ష్మి కడుపుకోతకి తట్టుకోలేక. నిర్వికారంగా చూశాడు గోవిందు. నిజమే ... పిల్లల్ని కనడమే మగతనం కాదు. పెంచడంకూడా.... కనడానికి భార్య వుంటే చాలు కాని పెంచడానికి? ప్రేమలు కడుపు నింపవు.... కాన్వెంట్ ఫీజులు కట్టవు. మరి పేదవాళ్ళు ఎవరూ పిల్లలని కనడంలేదా? బిచ్చగాళ్ళు కూడా కంటున్నారు. వారికి మరో రెండు చేతులు జోడైతే నష్టం లేదు. ఏమీ లేకపోయినా ఎన్నో కలలు కనే గోవింద్‌కు తన పిల్లలు ఎలాగో అలా పెరగడం యిష్టంలేదు... చక్కగా తను కోరుకున్నట్లుగా పెంచగలిగేవాళ్ళకు ఇచ్చేసాడు గోవిందు.. కారణం అతని గతం.... అందులోంచి పుట్టిన మనోగతం.

☆ ☆ ☆

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన గోవిందు తల్లితో మేనమామల పంచన చేరాడు.... ఒక్కో సంవత్సరం ఒక్కొక్కళ్ళు చూసేటట్టుగా వంతులు వేసుకున్నారు ఇద్దరు మేనమామలు. లేనిపోని జంజాటం మెడకు చుట్టుకుందని ఇద్దరు మేనత్తలు తల్లిని ఆడిపోసుకోవటం గోవిందుకు మొదటి నుంచి తెలుసు. ఎక్కడ వున్నా ఇంటి పని, వంటపని, అంట్లు తోమడం, బట్టలుతకడం, జాకెట్లు కుట్టడం... ఇలా క్షణం కూడా తీరిక లేకుండా పనిచేసేది గోవిందు తల్లి. గోవిందుని చదివించాలని,చక్కని ఉద్యోగం చేస్తే తమ బాధలు తీరుతాయని ఆమె

ఆశ. ఆశయం... మేనమామలవి కూడా పెద్ద ఉద్యోగాలేం కాదు..వాళ్ళ పిల్లలూ పెద్దవాళ్ళయే సరికి ఇంక మీ దారి మీరు చూసుకోండని గోవిందుని తల్లితో సహా బయటకు పంపిం చేసారు. అప్పటికి గోవిందు బి.కాం. రెండో సం॥లో వున్నాడు. ఇంకో సం॥ వుంచుకోమని గోవిందు తల్లి ఎంత ప్రాధేయపడ్డా వినలేదు.... అలా డిగ్రీ పూర్తి కాకుండానే రోడ్డున పడ్డాడు. ఓపాత సత్రంలో ఓ చిన్న గదిని అద్దెకు తీసుకుని తల్లితో కొత్త జీవితం మొదలుపెట్టాడు.... పేపర్ బోయ్‌గా, ఆఫీసు బాయ్‌గా, హోటల్‌లో బిల్లులు రాయడం ఇలా రకరకాల పనులు చేసేవాడు... చిన్నప్పటి నుంచి తన కోసం కష్టపడిన తల్లిని కూర్చోబెట్టాలని అతని ఉద్దేశం.... మొదట్లో తనూ ఏదైనా పని చేస్తానని తల్లి అంటే వద్ద న్నాడు. కానీ ఓ నాలుగు నెలల తరువాత తల్లి రెండిళ్ళల్లో వంట చేయడానికి ఒప్పుకున్నప్పుడు చూసీ చూడనట్లు ఊరుకున్నప్పుడు తన ప్రయోజ కత్వం ఏమిటో తెలిసొచ్చింది. నాలుగేళ్ళు గడిచాయి. ఇద్దరూ ఏవేవో పనులు చేస్తూనే వున్నారు... కాభట్టే అయిదువేళ్ళు నోట్లోకి వెళ్తున్నాయని ఇద్దరికీ తెలుసు. ఇంతలో వారిని వెతుక్కుంటూ ఓ మేనత్త వచ్చింది. ఇద్దరూ ఎంతో ఆశ్చర్యపడ్డారు. కుశల ప్రశ్నలయ్యాక...

'నీ సహాయం కావాలొదినా' అంది. గోవిందు తల్లిని చేతులు పట్టుకుని ఆ మేనత్త నేను సాయం చేయడమేమిటంది. గోవిందు తల్లి విస్తుపోతూ.

విషయం వివరించింది ఆ మేనత్త. ఆమెకో చెల్లెలుంది. ఇద్దరు ఆడపిల్లలు. ఆమె భర్త వ్యసనపరుడు. కుటుంబాన్ని సరిగ్గా సాకడు. అలాగే తాగి తాగి పోయాడు. పిల్లలిద్దరూ పెళ్ళీడుకొచ్చారు. కట్నాలిచ్చి పెళ్ళిచేసే పరి స్థితుల్లో లేరు. ఆ సమయంలో గోవిందు గుర్తుకు వచ్చాడు మేనత్తకి. అవసరం ఆమెది. వచ్చి చేతులు పట్టుకుంది. 'నా కభ్యంతరం లేదు వదినా. అయితే వాడికి సరైన ఉద్యోగంలేదు.... అందుకే ఆలోచిస్తున్నాను' అంది.

'ఉద్యోగానిదేముంది... గోవిందుకు తెలివి తేటలున్నాయి. సంపాదించుకుంటాడు. పిల్లనిచ్చుకున్నాక మేం మాత్రం వదిలేస్తామా. అన్నయ్యగారు కూడా ప్రయత్నిస్తారులే. నీ మీద కొండంత ఆశ పెట్టుకుని వచ్చాను. కష్టసుఖాలు తెలిసిన మనిషివి. మా అమ్మాయి చక్కగా వుంటుంది. టెన్త్ దాకా చదివింది. అది కూడా ఏదో పని చేయగలదు. ఆ పిల్లని నువ్వు కడుపులో పడేసుకుంటే ఆ కుటుంబానికి ఎంతో మేలు చేసిన దానివవుతావు. గోవిందు నువ్వు చెబితే కాదనడు' అంటూ అభ్యర్ధించి వెళ్ళి పోయింది.... గోవిందు ఒప్పుకోలేదు. 'నిన్ను, నన్ను చాలా కష్టాలు పెట్టారు వాళ్ళు... వాళ్ళ సంబంధం వద్దు. పైగా నేను నిన్నే పోషించు కోలేకపోతున్నా, ఇంక పెళ్ళాన్ని ఎక్కడ పెట్టు కోవాలి....' అనేశాడు.

'కాదు నాన్న..... ఆ మేనత్త చెల్లెలు నాకు తెలుసు...మంచివాళ్ళే. పాపం కష్టంలో వున్నారు. కష్టమైనా, నష్టమైనా ఓ పదేళ్ళు మనల్ని చూసింది మీ మేనత్త. ఆమె మాటను కూడా కొట్టేయకూడదు. నా ఆరోగ్యం కూడా బాగోటం లేదు. నీకు పెళ్ళి చేసేస్తే హాయిగా వెళ్ళిపోవచ్చు. ఏమో... ఆ పిల్ల అడుగుపెట్టిన వేళా విశేషాన నీకు మంచిఉద్యోగం రావొచ్చు... లేదంటే ఆ అమ్మాయి ఏదో పని చేస్తుందిలే" అని నచ్చచెప్ప టంతో కాదనలేకపోయాడు....

మేనత్త మళ్ళీ వచ్చి పెళ్ళి చూపులకని తీసుకెళ్ళింది... నచ్చకపోతే తప్పించుకోవచ్చులే అనుకొంటూ వెళ్ళాడు గోవిందు...

వంక పెట్టడానికి ఏ డొంకా దొరక లేదు.

అలా ప్రవేశించింది లక్ష్మి...

గోవిందుకి ఆనందంగాను, భయం గానూ వుంది.

గోవిందు చిన్నప్పటి నుంచి కష్టపడు తూనే ఉన్నాడు... చదువు పూర్తి చేసుకొని మంచి ఉద్యోగం సంపాదించుకొందామనుకుంటే చదువు పూర్తికాలేదు. తన మిత్రులొకరిద్దరూ డిగ్రీ పూర్తి చేసుకొని, కంప్యూటర్ కోర్స్ చేసి మంచి ఉద్యోగం సంపాదించుకొని పెళ్ళి చేసు కొన్నారు...తనకి డిగ్రీయే పూర్తికాలేదు... ఇప్పుడు చదువుకొనే పరిస్థితిలో లేదు. బ్రతుకుని ఎలాగో నెట్టుకొస్తున్నాడు... అసలు తనకెవ రయినా పిల్లనిస్తారా అని కూడా అనుమాన పడ్డాడు... అలాంటి సమయంలో అందం, అణకువ వున్న లక్ష్మి భార్యగా వచ్చింది. అందుకు ఆనందం.... ఉన్నది ఒక్కటే గది కావడంతో నీరుగారిపోయింది. భార్యతో తన సరసాలను పేదరికం పరిహసించింది. అద్దె ఎక్కువైనా రెండు గదులు, వంటిల్లు వున్న ఇల్లు తీసు కున్నాడు. అలా ఖర్చులు పెరిగాయి. రాత్రి పడుకొన్నప్పుడు హాయిగా వున్న సంసారం నిద్ర లేచేసరికి భయంకరంగా కనిపించసాగింది. ఎక్కువ వస్తుందేమోననుకొని ఉద్యోగాలు మారినా ఏం లాభం... వంద, రెండువందలు పెరుగుదల ఏ మూలకి...రెండో నెలలోనే లక్ష్మి కూడా ఓ సూపర్‌మార్కెట్‌లో సేల్స్ గరల్‌గా చేరింది... తల్లి ఆరోగ్యం కొంచెం పాడవడంతో ఆమెను ఏ పనిలోకి వెళ్ళనివ్వటంలేదు. దాంతో వారి పరిస్థితిలో ఏ మార్పులేదు.

ఇంతలో లక్ష్మి నెల తప్పింది... ఆ ఆనందం కూడా ఎక్కువ సేపు నిలువలేదు. ఇంకో ప్రాణి... అంటే అదనపు ఖర్చు... పిల్లాడు పుట్టాడు... ఆ పిల్లాడికి ఆరు నెలల వయసులో ఓసారి సుస్తీ చేసింది. గోవిందు ఊర్లో లేడు... ఇంట్లో డబ్బులు లేవు...దాంతో గోవిందు తల్లి తను ఇది వరకు వంట పని చేసిన వారింటికి వెళ్ళి సాయం అడిగింది... అప్పటికే లక్ష్మితో ఆ బాబుతో పరిచయమున్న వాళ్ళు సాయం చెయ్యడం నయం చెయ్యడం జరిగింది. పౌష్టిక ఆహారం లోపంవల్లనే జబ్బు వచ్చిందని డాక్టరు చెప్పాడు. అలా సాయం చేసిన దంపతు లకు పిల్లలు లేరు పెళ్ళయి పదేళ్ళయినా... ఫెర్టిలిటీ సెంటర్స్‌కి లక్షలు పోసినా లాభం లేకపోయింది. సుస్తీ తగ్గాక బాబుని గోవిందు తల్లి తరచుగా వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళేది. పిల్లల కోసం తపించేవాళ్ళకు బాబు బాగా చేరువైపోయాడు.. వాళ్ళకి ఓఆలోచన వచ్చింది. వాళ్ళు బాబును దత్తత తీసుకుంటా మన్నారు. గోవిందు, లక్ష్మిలు ఇంకా చిన్న వయసు వాళ్ళే కాబట్టి పిల్లలు పుట్టే అవకాశం ఇంకా వుంది కాబట్టి ఆ బాబుని దత్తతకి అడిగారు.

గోవిందు వెంటనే ఒప్పుకున్నాడు. లక్ష్మిని ఒప్పించాడు.

తన స్తోమతకి కొడుకుని మునిసిపల్ స్కూల్లో చదివించగలడు. వాడు పెరిగి బహుశ

తనలాగే పాట్లు పడతాడు. దత్తతకిస్తే అక్కడ యువరాజులా పెరుగుతాడు... వారు చెప్పి నట్లు తాము ఇంకో సంతానాన్ని కని పెంచు కొంటె సరిపోతుంది అని సర్దిచెప్పుకున్నాడు. బాబు పెరగుతున్నాడు.. మాటలు వస్తున్నాయి.. వాడిని చూడటానికి లక్ష్మి వెళ్ళేది. లక్ష్మిని 'ఆంటీ'గా పిలిపించేవారు. తట్టుకోలేక భోరు మని తన పిల్లాడిని తనకిచ్చేయమనేసింది కూడా. అది కుదరదని అధికారికంగా దత్తతకు తీసుకున్నామని అసలు తమ ఇంటికి ఆమె రాకూడదని చెప్పి ఆ ప్రాంతం నుంచి వాళ్ళు వెళ్ళిపోయారు. వారు చేసింది సబబే అని లక్ష్మిని ఊరడించాడు గోవిందు. ముందు ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకొని తరువాత పిల్లలని కందాం అన్నాడు.

☆ ☆ ☆

మరో రెండేళ్లు గడిచాయి.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది. ఉద్యోగం చేస్తూ పైసా పైసా కూడగట్టాడు... అతని 'స్థాయికి' ఏ ఉద్యోగంలోనైనా సంవత్సరానికి ఓ రెండు మూడు వందల ఇంక్రిమెంట్ వస్తుందేమో కాని వేలకి వేలు జీతం పెరగదుకదా... అందుకని వ్యాపారం మొదలుపెట్టాడు... బెడిసికొట్టింది. మళ్ళీ ఉద్యోగంలో చేరాడు...లక్ష్మి సేల్స్ గరల్‌గా చేస్తూనే వుంది... గోవిందు తల్లి ఆరోగ్యం క్షీణిస్తూనే వుంది... కాస్త కూస్త మిగిలితే ఆమె మందులకే సరిపోయేది.

లక్ష్మి మళ్ళీ నెల తప్పింది... నెలలు నిండుతున్నాయి... గోవిందు తల్లికి సీరియస్ చేసింది... తను పని చేస్తున్న కాంట్రాక్టర్ దగ్గర అడ్వాన్స్ తీసుకొని తల్లికి వైద్యం చేయించాడు. "నా మీద ఎందుకురా ఖర్చు పెడతావు. నాది పోయే ప్రాణం. రాబోయే ప్రాణం ఉంది..దాని కోసం దాచుకో... మొదటి బిడ్డని నిలుపుకోలేక పోయావు... నా మీద ఖర్చు పెట్టకు... నేను పోయి మళ్ళీ నీ కడుపునే పుడతానురా" అనేది.

"ఆ పని మాత్రం చెయ్యొద్దమ్మా" అను కొన్నాడు గోవిందు... ఎందుకంటే ఆడపిల్ల పుడితే ఖర్చు ఎక్కువ. బహుశ దత్తత కూడా ఎవరూ తీసుకోరేమో.???

☆ ☆ ☆

గోవిందు తల్లి పోయింది. అప్పును మిగిలుస్తూ... లక్ష్మి ఆడపిల్లని ప్రసవించింది.

☆ ☆ ☆

లక్షని రెండులక్షలు చెయ్యడం సులభం. రూపాయిని రెండు రూపాయలు చెయ్యడం చాలా కష్టం...

నాకు లాటరీలో కోట్లు వస్తున్నాయి. ఓ కోటి రూపాయలు అప్పు ఇమ్మంటే ఇచ్చే సారు. అసలు కోట్ల రూ॥లు వస్తున్నవాడికి అప్పు ఎందుకు అని ఆలోచించరు.

నా దగ్గర రూపాయుంది... ఇంకో రూపాయిమ్మంటె ఇవ్వరు. కోట్లున్న వాడు కోట్లలో అప్పు చెయ్యెచ్చు. అప్పు పుడుతుంది కూడా...... రూపాయే ఉన్నవాడు అప్పుకి అనర్హుడు. అప్పు దొరకదు. కాబట్టి ఏ విధంగా చూసినా ధనవంతులకి తిరుగులేదు. బ్యాంకులు ఇన్ కంటాక్స్ విభాగాలు కోట్లలో బకాయిపడిన వాళ్ళని ఏం చెయ్యలేవు. వేలలో ఎగవేసిన వాళ్ళనే పట్టు కొంటాయి ముందుగా తల్లి మరణం దుఃఖాన్నే కాకుండా ఇరవైవేల అప్పుని మిగిల్చింది గోవిందుకి. ప్రతినెలా లోటు బడ్జెట్ అయిన సంసారానికి ఇరవై వేల అప్పు తీర్చటం అంటే ఆషామాషి వ్యవహారం కాదు. ఆ దిగులతో వున్న అతనికి కొత్త ప్రాణి వస్తోందన్న విషయం ఆనందం కలిగించటంలేదు.

కాలగమనంలో మార్పులు సహజం... "భారతదేశంలో కోటీశ్వరుల సంఖ్య పెరగు తోంది" అనే వార్తను చూసి భారతదేశం సుసంపన్నం అవుతోంది అనుకొంటె పొరబాటే. ఆ వార్త నిజమే... కానీ అదే నివేదికలో "సంపన్నులకి పేదవాళ్ళకి మధ్య వ్యత్యాసం కూడా పెరుగుతోంది" అని కూడా పేర్కొన బడింది. అంటే అర్థం ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు...పేదవాళ్ళు అలాగే వున్నారని కావచ్చు.. లేదా ఇంకా దిగజారు తున్నారని కూడా చెప్పుకోవచ్చు. పేదల, దిగువ మధ్య తరగతి జీవన ప్రమాణాలలో మార్పు అనేది రాత్రికిరాత్రి కాదు ఓ 'జీవనకాలం'లో కూడా సాధ్యపడకపోవచ్చు... అడ్డదారులు త్రొక్కో, ఏ బ్యాంక్‌నో కొల్లగొడితే తప్ప.

గోవిందుకి బాగా అర్థమయినది 'ప్రేమ' కడుపు నింపదని. అతడికి తల్లిపైగల ప్రేమని అతను శక్తికి మించి చేసిన అప్పులో చూడ వచ్చు... భార్యని ప్రేమిస్తే పిల్లలు పుట్టు కొస్తున్నారు. పుట్టిన పిల్లాడిని చక్కగా పెంచలేక 'యువరాజులా పెరగాలనే దత్తత ఇచ్చేసింది ప్రేమతోనే. 'అందరూ పెంచటం లేదా'? అని లక్ష్మి అంటె అందరి సంగతి నా కనవసరం అనేవాడు. మేనత్తల చీదరింపుతో గడిచిన తన బాల్యం గుర్తుకొచ్చేది.... తోటి పిల్లలతో ఆడు కోవడానికి కూడా వీలు లేకుండా ఇంట్లో ఏవేవో పనులు చేస్తూ, ఆమె పిల్లలను ఆడించడమే తన ఆటగా పెరిగాడు....బహుశా తాను, తల్లి వారికి భారమవటంవల్లనే ఆమె అలా ప్రవర్తిం చిందేమో! వారికి భారం అంటే వారికి"అంత డబ్బు" లేకపోవటమే... అసలు తమకే డబ్బు ఉంటే వారికి ఎందుకు "భారం" అయ్యేవాళ్ళు? కాబట్టి జీవితం హాయిగా గడవాలంటే డబ్బు కావాలి..ఆ డబ్బుంటే'ప్రేమ' కూడా వుంటుంది. లేకపోతే సినిమాలలో 'ప్రేమ' ని చూసుకోవచ్చు. అందుకే ఆర్థిక పరిపుష్టి లేకుండా 'సంసారం' లోకి ప్రవేశించ కూడదనుకున్నాడు. కాని "నా ఆరోగ్యం బాగుండటంలేదురా. నీ పెళ్ళి చూసి పోతానురా, తరువాత మనవడిని చూసి పోతా నురా"అంటూ తల్లిపట్టు బట్టడంతో అయిష్టం గానే సంసారసాగరంలో పడ్డాడు. తన కోసం చిన్నప్పటి నుంచి కష్టపడింది. తాను పెద్దవాడ యినా ఆమెను కష్టపడకుండా ఆపలేకపోయాడు. అందుకే అతడు మరో కఠినమైన నిర్ణయాన్ని తీసుకున్నాడు.

పుట్టిన బిడ్డను చూసి మురిసిపోతూ ఓ ప్రక్క దిగులుగా వున్న భర్తను చూసి అర్థం చేసుకుని "ఎందకండీ అంత భయపడతారు. నారు పోసిన వాడు నీరు పోయడా..." అంటూ నచ్చ చెప్పబోయి వినకబోయేసరికి "రోజు కూలీలు కూడా మీకన్నా పాజిటివ్‌గా ఆలో చిస్తారు. పిల్లల కోసం ప్రాణాలిస్తారు" అనేసింది విసుగ్గా. "మొన్నే నా యువరాజుని చూసి వచ్చాను లక్ష్మి' అన్నాడు నిదానంగా.

'నిజంగానా! ఎలా వున్నాడు? నాకు చెప్పలేదేం' అంది.

'అసలెక్కడ వున్నారు?'

'వాళ్ళకి తెలియకుండా వాళ్ళ అడ్రసు కనుక్కొన్నాను. కలవ కుండా దూరం నుంచి చూసి వస్తూనే వున్నాను. మొన్న వెళ్ళినప్పుడు రిమోట్ కంట్రోల్ కారుతో ఆడుకుంటూ కనబడ్డాడు. ఆ కార్లు, డ్రస్సులు నా దగ్గరుంటే నేను కొనగలనా. అసలు తిండి పెట్టగలనా' గోవిందు కంఠం జీరబోయింది.... తేరుకొని 'నిన్నే పేపర్లో చదివాను ఆర్థిక ఇబ్బందుల వలన పిల్లలని, పెళ్ళాన్ని ఉరితీసి తాను ఆత్మహత్య చేసుకున్నాడట ఒకతను నెల్లూరులో. నీరు పోస్తాడనే పాజిటివ్‌గా ఇన్నాళ్ళు బ్రతికి వుంటాడు. నేను అంతకన్నా దుర్మార్గుడినా? నా పిల్లలను నేను చంపుకోలేదే. గాలికి కూడా వదలను, ఏదోలా బ్రతుకుతారులే అని. చక్కగా పెరిగేటట్లే చేస్తాను, నా దగ్గర కాకపోయినా' ఇంక మాట్లాడలేకపోయాడు లక్ష్మి తల వంచు కుంది ఏం మాట్లాడాలో తెలియక.

☆ ☆ ☆

కాని ఇప్పుడు అపరకాళీలా అరుస్తుంది లక్ష్మి....

'ఈ బిడ్డని కూడా ఇచ్చేయడానికి చేతు లెలావచ్చాయండి...ఎంత కమ్ముకున్నారండీ.... ఏం మగాళ్ళండీ మీరు'

'లక్ష్మి. లక్ష్మి....నా ప్లాను పూర్తిగా విను పిల్లల కోసం అలమటిస్తున్న ఓ దంపతుల దగ్గరకు చేరింది మన బిడ్డ. ఆరోగ్యవంతుల బిడ్డ. ఆడయినా, మగయినా ఎవరినైనా దత్తత చేసుకుంటామని ఈ నర్సుకు చెప్పి వున్నారట. నర్సు ఆ ప్రయత్నంలో వుంది. మన సంగతి గమనించి అడిగింది. నేను వారిని కలిసాను. మనం యిచ్చేయడానికి కారణం తెలుసు కున్నారు. నాకు ఏవో పరీక్షలు చేయించి సంతృప్తి పడ్డారు. డబ్బు వద్దంటే తన ఫ్రెండ్ కంపెనీలో ముందు అటెండర్‌గా వేయిస్తానన్నారు. డిగ్రీ పూర్తి చెయ్యి నీకు ఇంకా మంచి ఉద్యోగం వేయిస్తానన్నారు. అయితే వారింటికి పిల్లని చూడడానికి మాత్రం రాకూడదన్నారు. అందుకే తెలివిగా ఉద్యోగం ఈ విజయవాడలో కాకుండా దూరంగా విశాఖపట్నంలో వేయించారు. నెల జీతం అడ్వాన్స్‌గా కూడా ఇచ్చారు. కాంట్రాక్టర్ దగ్గర చేసిన అప్పు గురించి చెబితె ఆ కాంట్రా క్టర్ నాకుతెలుసు నే చెబుతాలే నీకు వీలున్నప్పుడు తీర్చేద్దువుగాని అన్నారు'. చూడు లక్ష్మి.... ఇంక నా అసలు ప్లాను మనం వైజాగ్ వెళ్ళిపోదాం. నేను ఆ జాబ్‌లో చేరతా. నీకు సేల్స్‌గరల్ ఉద్యోగం దొరక్కపోదు. నేను డిగ్రీ పూర్తి చేస్తా. ఇంకా మంచిఉద్యోగం సంపాదిస్తా. నాకు ఇంకా ముప్పై నిండలేదు. ఈ వయసుకు ఇంకా చాలా మందికి పెళ్ళిళ్ళే కావటంలేదు. కాబట్టి మనం కాస్త నిలదొక్కుకున్నాక అప్పుడు పిల్లల్ని కంటా.. 'యువరాజు'లా నేనే పెంచుతా. నేనెలాంటి మగాడినో చూపిస్తా" అన్నాడు ఆవేశంగా.

లక్ష్మి. ఉన్నట్టుండి పెద్ద పెట్టున నవ్వ సాగింది. కంగారు పడ్డాడు గోవిందు.... షాక్ తిని పిచ్చెక్కలేదుగా అనుకొంటూ....

"లక్ష్మి... లక్ష్మి.... అంటూ భుజాలు పట్టుకుని మంచం మీద కూలబెట్టాడు."ఎంత పని చేసారండీ...నాతో ఒక్కమాట కూడా ముందు చెప్పి వుంటే ఎంత బాగుండును! ఇక్కడ చేరిన రోజే కొంత మంది డాక్టర్లు వచ్చారు. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుంటే మంచిదంటూ నన్ను చూసిన డాక్టరు కూడా నీ గర్భసంచిలో ఏదో లోపం వుంది.... కాన్పు అయ్యాక రా.... పెద్ద ఆపరేషన్ చెయ్యాలి... ఇంక పిల్లల్ని కనకూడదు....కనలేవు...ఈ కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించేసుకో... డబ్బులిస్తానన్నారు. ఇంతకు ముందు పిల్లలు లేరన్నావు... ఆర్థికస్తోమత కూడా లేదం టున్నావు.... ఒక వేళ ఆడపిల్ల పుట్టినా పెళ్ళి గురించి విచారించే అవసరం లేకుండా గవర్న మెంట్ ఒక పథకం ప్రకటించింది. నీకు డబ్బులు, సేవింగ్స్ సర్టిఫికెట్ ఇస్తారు. అంటూ ప్రోత్స హించిందండీ... మీకు చెబుదామంటే మీరు బయటున్నారు. ఇంతలో నాకు నొప్పులెక్కువై పోయాయి. కానుపయ్యాక చూస్తే ఆడపిల్ల. ఇంక ఆపరేషన్ చేయించేసుకున్నానండి. ఇంక మనకి పిల్లలు పుట్టరు. ఆ పిల్లని ఎలాగోలా పెంచుదామనుకున్నానండి. యువరాణిలా కాకపోయినా;ఇంక ఎందుకండీ డబ్బు.... మీకు పెద్దఉద్యోగం వచ్చినా ఈ వింత గొడ్రాలు ఏం సుఖపడుతుంది? ఎవరికి పెట్టుకుంటారు డబ్బు? 'రిమోట్ కంట్రోల్ కార్లు కొనుక్కొని మనిద్దరం ఆడుకోవాలా? నారు పోసిన వాడే నీరు పోస్తాడనుకోవటం పొరపాటు. నీరు పొయ్యడు అనేవారు ఇప్పుడు నారే పోయదండీ" అంటూ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది లక్ష్మి.




